క్లుప్తంగా

దేవరకొండ ఎమ్మెల్యేగా ఆశీర్వదించండి

కొండమల్లేపల్లి : ఎమ్మెల్యేగా మరోసారి అవకాశం ఇవ్వాలని బీఆర్‌ఎస్ అభ్యర్థి రవీంద్రకుమార్ ప్రజలను కోరారు. మంగళవారం కొండమల్లేపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన రోడ్ షోలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు కొనసాగేందుకు బీఆర్‌ఎస్ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ అమిత్‌రెడ్డి, సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్, దస్రూనాయక్, లింగారెడ్డి, యుగంధర్‌రెడ్డి, కృష్ణ, రమావత్ రమేశ్, తులసిరాం పాల్గొన్నారు.

భగత్ గెలుపు నల్లేరుపై నడకే

గుర్రంపోడు : బీఆర్‌ఎస్ అభ్యర్థి నోముల భగత్ గెలుపు నల్లేరుపై నడకేనని అమెరికా దేశ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు నాగులవంచ నర్సింహారావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపిస్తాయన్నారు. ఈ సమావేశంలో ఎన్‌ఆర్‌ఐలు సాయల రవి, ఉత్తమ్ పాల్గొన్నారు.

మరోసారి బీఆర్‌ఎస్‌కు పట్టం కట్టండి



మిర్యాలగూడ : ర్యాలీలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి భాస్కర్‌రావు



మిర్యాలగూడ : ర్యాలీలో పాల్గొన్న నాయకులతో కలిసి నృత్యం చేస్తున్న సిద్ధార్థ

- మిర్యాలగూడ అభ్యర్థి నల్లమోతు భాస్కర్‌రావు

మిర్యాలగూడ : ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందించిన, అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన బీఆర్‌ఎస్ పార్టీకి మరోసారి పట్టం కట్టాలని ఆ పార్టీ మిర్యాలగూడ అభ్యర్థి భాస్కర్‌రావు అన్నారు. మంగళవారం పట్టణంలో బీఆర్‌ఎస్ మహిళా విభాగం ఆధ్వర్యంలో హనుమాన్‌పేట ఫ్లైఓవర్ బ్రిడ్జి నుంచి రాజీవ్‌చౌక్ వరకు వేలాది మంది మహిళలతో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు అలుగుబెల్లి అమరేందర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్‌తో కలిసి భాస్కర్‌రావు పాల్గొని మాట్లాడారు. 2018 నుంచి 2023 వరకు మిర్యాలగూడ నియోజకవర్గంలో రూ.2,750కోట్ల అభివృద్ధి పనులను నిర్వహించినట్లు తెలిపారు. పట్టణంలో రూ.10కోట్లతో కేసీఆర్ కళాభారతి, రూ.13కోట్లతో నల్లగొండ రోడ్డు విస్తరణ చేపట్టి సెంట్రల్ లైటింగ్‌తోపాటు ఇరువైపులా డ్రెయినేజీలు నిర్మించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి నల్లమోతు జయ, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ నాగలక్ష్మీభార్గవ్, భవాని, ఎంపీపీ సరళహన్మంతరెడ్డి, కళావతి, పాల్గొన్నారు.

మళ్లీ బీఆర్‌ఎస్సే రావాలి

మహిళా సంక్షేమం కోసం మళ్లీ బీఆర్‌ఎస్ ప్రభుత్వమే అధికారంలోకి రావాలని, అందుకోసం మిర్యాలగూడ ఎమ్మెల్యే అభ్యర్థి భాస్కర్‌రావును గెలిపించాలని ఆయన సతీమణి నల్లమోతు జయ కోరారు. మంగళవారం పట్టణంలోని ప్రకాశ్‌నగర్‌లో స్థానిక కౌన్సిలర్ రమావత్ కమిలి భీమ్లానాయక్‌తో కలిసి బీఆర్‌ఎస్ ఎన్నికల ప్రచారం నిర్వహించి పార్టీ ఎన్నికల మేనిఫెస్టోను ప్రజలకు వివరించి ఓట్లను అభ్యర్థించారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

మిర్యాలగూడ : దామరచర్ల మండలం వీర్లపాలెం గ్రామానికి చెందిన 150 కుటుంబాలు డీసీఎంఎస్ చైర్మన్ దుర్గంపూడి నారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ సైదులురెడ్డిల ఆధ్వర్యంలో మంగళవారం బీఆర్‌ఎస్ యువ నాయకుడు నల్లమోతు సిద్ధార్థ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈనెల 30న కారు గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి భాస్కర్‌రావును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు లింగిరెడ్డి హనిమిరెడ్డి, మాజీ సర్పంచ్‌లు హర్యానాయక్, కోట్యానాయక్, ఏఎంసీ డైరెక్టర్ బాలునాయక్, పాల్గొన్నారు.



'సాగర్ నియోజకవర్గ ప్రజలే నా బలం.. బలగం. నేను ప్రచారానికి వెళ్తే బ్రహ్మరథం పడుతున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ చేరాయి. గతంతో పోల్చితే నాగార్జున సాగర్ నియోజకవర్గంలో గణనీయమైన అభివృద్ధి జరిగింది. బీఆర్‌ఎస్ పథకాలు, నేను చేసిన అభివృద్ధి నన్ను గెలిపిస్తాయి' అని ధీమా వ్యక్తం చేస్తున్నారు. నాగార్జునసాగర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి నోముల భగత్ సాక్షితో మాట్లాడారు. - హాలియా

నిత్యం అందుబాటులో ఉంటా

- ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలే నన్ను గెలిపిస్తాయి
- నాగార్జునసాగర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి నోముల భగత్

సాగర్ ఉప ఎన్నికల్లో ఈ ప్రాంత ప్రజలు నన్ను గెలిపించారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా నిత్యం వారికి అందుబాటులో ఉంటున్నా. ఇక్కడే స్థిరనివాసం ఏర్పచుకుని నియోజకవర్గ ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకున్నా. సాగర్‌లో ఏడు సార్లు పాలించినవారు చేయని అభివృద్ధిని కేవలం రెండున్నరేళ్లల్లోనే నేను చేసి చూపెట్టా. బలహీనవర్గాల బిడ్డగా ప్రజలు మరోసారి ఆశీర్వదించి ఎమ్మెల్యేగా గెలిపిస్తే.. నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసి చూపిస్తా.

రూ.200 కోట్లతో అభివృద్ధి చేశా..

2018లో తొలిసారిగా మా నాన్న నోముల నర్సింహయ్య ఎమ్మెల్యేగా గెలిచాక హాలియా, నందికొండను మున్సిపాలిటీలుగా ఏర్పాటు చేశారు. నియోజక వర్గంలో 40 తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేశాం. నేను గెలిచాక రూ.60 కోట్లతో హాలియా, నందికొండ పట్టణాల్లో అనేక అభివృద్ధి పనులు చేపట్టాం. వరద కాల్వ పనులను పూర్తి చేసి 50 వేల ఎకరాలకు సాగునీరు అందించాం. నియోజకవర్గంలో 10 విద్యుత్ సబ్‌స్టేషన్లు నిర్మించాం. నందికొండలో క్వాటర్స్‌లో నివాసం ఉంటున్న వారికి పట్టాలు ఇచ్చాం. హాలియాలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, బీసీ గురుకుల డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేశాం. సాగర్‌లో డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేశాం. నియోజకవర్గంలోని మూడు పీహెచ్‌సీలకు రూ.25 లక్షల చొప్పున కేటాయించి అభివృద్ధి చేశాం. కంపాసాగర్‌లో ఉన్న పాలిటెక్నిక్ కళాశాలను బీఎస్సీ అగ్రికల్చర్ కళాశాలగా ఏర్పాటు చేయడమే నాముందు ఉన్న ఏకైక లక్ష్యం.

నెల్లికల్లు పనులు శరవేగంగా సాగుతున్నాయి..

రూ.664 కోట్లతో నెల్లికల్లు లిఫ్ట్ పనులు శరవేగంగా సాగుతున్నాయి. పెద్దవూర మండలంలో సుమారు రూ.2.5 కోట్లతో డీ8, డీ9 లిఫ్ట్ పనులు పూర్తి చేశాం. దీని ద్వారా 7300 ఎకరాలకు సాగునీరు అందనుంది. రూ.33.81 కోట్లతో చెక్‌డ్యాంల నిర్మాణం చేపట్టాం. ఇంకా త్రిపురారం, గుర్రంపోడు, పెద్దవూర మండలాల్లో లిఫ్టులు, చెక్‌డ్యాంల ఏర్పాటు చేయాల్సి ఉంది.

కాంగ్రెస్‌తోనే సమగ్రాభివృద్ధి సాధ్యం



త్రిపురారం : అభివాదం చేస్తున్న జైవీర్‌రెడ్డి



హాలియా : పార్టీలోకి ఆహ్వానిస్తున్న జైవీర్‌రెడ్డి

హాలియా : కాంగ్రెస్ పార్టీతోనే సమగ్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం సాధ్యమవుతుందని నాగార్జునసాగర్ కాంగ్రెస్ అభ్యర్థి జైవీర్‌రెడ్డి అన్నారు. నిడమనూరు మండలంలోని వెంకటనగర్ గ్రామానికి చెందిన వివిధ పార్టీల కార్యకర్తలు మంగళవారం హాలియా పట్టణంలో జైవీర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరిన వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాధరంగా ఆహ్వానించారు.

ఆరు గ్యారంటీల అమలు బాధ్యత నాదే

త్రిపురారం : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీల అమలు బాధ్యత తనేదని, భారీ మెజార్టీతో గెలిపించాలని నాగార్జునసాగర్ కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని జీ అన్నారం, కొణతాలపల్లి, కామరెడ్డిగూడెం, కంపాలపల్లి, మునగబావి గూడెం గ్రామాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. అనంతరం మండలంలోని అంజన పల్లి, కొణతాల పల్లి, కామరెడ్డి గూడెం గ్రామాల్లోని బీఆర్‌ఎస్ కార్యకర్తలు బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేసి జైవీర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బుచ్చి రెడ్డి, ఎంపీపీ పాండమ్మ, జెడ్పీటీసీ భారతీ, అన్నారం సర్పంచ్ సుబాష్ రెడ్డి, ఉప సర్పంచ్ నరేష్, పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల పేరిట దోపిడీ

మాడుగులపల్లి : సంక్షేమ పథకాల పేరిట కేసీఆర్ కుటుంబం, అనుచరగణం రాష్ట్ర సంపదను దోచుకున్నారని నాగార్జున సాగర్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి జైవీర్‌రెడ్డి ఆరోపించారు. మండలంలోని కన్నెకల్లు గ్రామంలో మంగళవారం ఆయన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కొండేటి మల్లయ్యతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను కచ్చితంగా అమలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మల్లయ్య, సర్పంచ్‌లు శ్రీనివాస్‌రెడ్డి, యాదయ్య, సైదిరెడ్డి, వెంకన్న, లింగారెడ్డి, కట్టెబోయిన అనిల్‌యాదవ్ పాల్గొన్నారు.

జైవీర్‌రెడ్డిని గెలిపించాలి

నిడమనూరు: కాంగ్రెస్ అభ్యర్థి జైవీర్‌రెడ్డి గెలిపించాలని కోరుతూ మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మండల కేంద్రంలో సర్పంచ్ మేరెడ్డి పుష్పలత, మేరెడ్డి వెకంట్, మహిళా నాయకురాలు శ్రీలత, శాకపురంలో శ్రీను, సునీతలు జైవీర్‌రెడ్డికి ఓటు వేయాలని ప్రచారం చేశారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు బొల్లం బాలయ్య, బొల్లం శ్రీను, ఉన్నం చిన వీరయ్య, దాసు, పురెషోత్తం రెడ్డి, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్. ఇషాక్, ఆదామ్ తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ అభివృద్ధికి కృషిచేస్తా



కోర్టులో న్యాయవాదులను కలిసి ఓటు అభ్యర్థిస్తున్న రంగారెడ్డి



ప్రజలను ఓటు వేయాలని కోరుతున్న రంగారెడ్డి

మిర్యాలగూడ : ఈసారి ఎన్నికల్లో గెలిపిస్తే నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని సీపీఎం అభ్యర్థి జూలకంటి రంగారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కొత్తగూడెం, కిష్టాపురం, పట్టణంలోని మెయిన్‌బజార్ ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1994, 2004, 2009లలో ఎమ్మెల్యేగా పనిచేశానని, ఎన్టీఆర్, చంద్రబాబు నాయుడు, వైఎస్సార్, రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వాల్లో తాను ఎమ్మెల్యేగా ఉండి నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేసినట్లు తెలిపారు. తన హయాంలోనే ఫ్లైఓవర్ బ్రిడ్జి, రవీంద్ర భారతి, సుందరయ్యపార్క్, బోటింగ్, ఈఎస్ఐ ఆసుపత్రి, అధునాతన గ్రంథాలయం, ఆలగడప, బీమారం బ్రిడ్జి నిర్మాణాలు చేపట్టినట్లు తెలిపారు. దామరచర్ల మండలంలో అనేక లిఫ్ట్ ఇరిగేషన్లు మంజూరు చేయించినట్లు తెలిపారు. తన హయాంలోనే సీఎంఆర్ఎఫ్ అత్యధికంగా మంజూరు చేయించానన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, నాయకులు వెంకటేశ్వర్లు, రవినాయక్, గౌతంరెడ్డి పాల్గొన్నారు.